సాక్షి
శ్రీకాకుళం
మంగళవారం ¦ 26 ¦ సెప్టెంబర్ ¦ 2023



ప్రయాణం మరింత సుఖవంతం

ఆర్టీసీ వృద్ధులకు శుభవార్త చెప్పింది. డిజిటల్ ఆధార్ చూపినా రాయితీ వర్తిస్తుంది.

- 8లో



క్రీడలతో విశ్వవ్యాప్త గుర్తింపు

జిల్లాస్థాయి స్కూల్‌గేమ్స్ ఎంపిక పోటీలు ప్రారంభమయ్యాయి. పోటీలు ఉత్సాహంగా జరిగాయి.

- 8లో



కలెక్టర్‌ను కలిసిన టెక్కలి సబ్ కలెక్టర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ కమర్ జిల్లా కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్‌ను సోమవారం శ్రీకాకుళంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఆదివారం వరకు కలెక్టర్ సెలవులో ఉండడంతో సోమవారం కలిసి పుష్పగుచ్ఛం అందించారు.

న్యూస్‌రీల్

27న పీజీ సీట్ల అలాట్‌మెంట్

ఎచ్చెర్ల క్యాంపస్: ఏపీ పీజీసెట్–2023 సీట్ల అలాట్‌మెంట్ 27న ప్రకటించనున్నారు. కౌన్సెలింగ్ ఇప్పటికే ముగిసింది. సోమవారం ఆప్షన్ల మార్పు సైతం పూర్తయ్యింది. సెట్ ఆంధ్రావిశ్వవిద్యాలయం నిర్వహించింది. రాష్ట్ర విశ్వవిద్యాలయాలు 14, అఫిలియేషన్ కళాశాలల్లో సీట్లు కేటాయిస్తారు. విద్యార్థుల ఆప్షన్, ర్యాంక్, రిజర్వేషన్ రోస్టర్ ఆధారంగా ఈ ప్రవేశాలు కల్పిస్తారు. జిల్లా విద్యార్థులు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం, ఆంధ్రా విశ్వవిద్యాలయంలో పీజీ కోర్సులకు ప్రాధాన్యత ఇచ్చారు. 27 సాయంత్రం సీట్లు ప్రకటించనున్నారు. సీట్లు లభించిన విద్యార్థులు 29వ తేదీన కళాశాలలకు రిపోర్టు చేయాల్సి ఉంటుంది.

ఘనంగా ఆదిత్యుని కల్యాణం



కల్యాణోత్సవం జరుగుతున్న దృశ్యం

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఏకాదశి కల్యాణోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. భాద్రపద శుద్ధ ఏకాదశి పర్వదినాన శ్రీ ఉషాపద్మినీఛాయా సమేత సూర్యనారాయణస్వామి కల్యాణమూర్తులను ఉత్సవమూర్తులుగా అలంకరించి స్థానిక అనివేటి మండపంలో ఆగమ శాస్త్ర ప్రకారం కల్యాణం జరిపించారు. రూ.500 చెల్లించి పలువురు భక్త దంపతులు ఈ కల్యాణ సేవలో పాల్గొని స్వామి శేష వస్త్రాలు, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ, ఈఓ వి.హరిసూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

సెమిస్టర్ ఫలితాలు విడుదల

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం, అఫిలియేషన్ పోస్టు గ్రాడ్యుయేషన్ కళాశాలల నాలుగో సెమిస్టర్, ఎంసీఏ, ఎంఎస్సీ కంప్యూటర్స్ ఒకటి, మూడు సెమిస్టర్ ఫలితాలను ఎగ్జామినేషన్స్ డీన్ డాక్టర్ ఎస్.ఉదయ్‌భాస్కర్ సోమవారం విడుదల చేశారు. నాలుగో సెమిస్టర్‌లో 17 పీజీ కోర్సులకు సంబంధించి 437 మంది హాజరు కాగా, 392 మంది ఉత్తీర్ణత సాధించారు. ఎంసీఏ మొదటి సెమిస్టర్‌లో 38కి 29 మంది, మూడో సెమిస్టర్‌లో 45కి 42 మంది, ఎంఎస్సీ కంప్యూటర్స్‌లో మొదటి సెమిస్టర్‌లో 27కి 19 మంది, మూడో సెమిస్టర్‌లో 13కి 9 మంది ఉత్తీర్ణత సాధించారు. పీజీ నాలుగో సెమిస్టర్ సబ్జెక్టుల వారీగా పరిశీలిస్తే జువాలజీలో 7కి 7, జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్‌లో 5 కి 5, ఎకనామిక్స్‌లో 5 కి 5, ఇంగ్లిష్‌లో 9 కి 9, రూరల్ డెవలప్‌మెంట్‌లో 2 కి 2, తెలుగులో 7 కి 7, ఎంబీఏలో 49 కి 49, ఎంకాంలో 23కి 23, ఎంఈడీలో 31 కి 30, ఎంఎల్ఐఎస్సీలో 10 కి 10, ఎనలిటికల్ కెమిస్ట్రీలో 53కి 41, బయోటెక్నాలజీలో 29కి 29, ఫిజిక్స్‌లో 22కి 19, ఆర్గానిక్ కెమిస్ట్రీలో 149కి 120, గణితంలో 20 కి 20, కంప్యూటర్ సైన్స్‌లో 12 కి 12, అప్లయిడ్ మ్యాథ్‌మెటిక్స్‌లో నలుగురికి నలుగురు ఉత్తీర్ణత సాధించారు. 15 రోజుల్లోగా విద్యార్థులు రీ వాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకునే వెసులుబాటు కల్పించారు. ఫలితాలు జ్ఞానభూమి వెబ్ సైట్‌లో అందుబాటులో ఉంచారు. మార్కుల జాబితాలు, ప్రొవిజనల్ ధ్రువీకరణ పత్రాలు సిద్ధం చేస్తున్నారు.

ఘనంగా శ్రీముఖలింగేశ్వరుని తిరువీధి



చక్కగా అలంకరించిన పార్వతీపరమేశ్వరుల ఉత్సవ మూర్తులు

జలుమూరు: భాద్రపద మాసం శుద్ధ ఏకాదశి సందర్భంగా శ్రీముఖలింగంలోని స్వామికి సోమవారం తిరువీధి ఉత్సవం నిర్వహించారు. గణపతి పూజతో ప్రారంభించి స్వామి వారికి ఏకవార అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. పార్వతీపరమేశ్వరుల ఉత్సవ మూర్తులను చక్కగా అలంకరించి పల్లకిలో ఆశీనులుగా చేశారు. అనంతరం మంగళవాయిద్యాల నడుమ తిరువీధి నిర్వహించగా భక్తులు హాజరయ్యారు.

సేద్యం.. సుసాధ్యం



శ్రీకాకుళం సమీప పొలాల్లో పచ్చదనం

- మేలు చేసిన తాజా వర్షాలు
- జిల్లాలో సాధారణ విస్తీర్ణంలో ఖరీఫ్ సాగు
- వంశధార, తోటపల్లి ద్వారా శివారు ఆయకట్టుకు అందుతున్న సాగునీరు
- ఇచ్ఛాపురం నియోజకవర్గంలో తక్కువ ఊభాలు
- ఆ మండలాల్లో ప్రత్యామ్నాయ సాగుకు చర్యలు
- సాగు విస్తీర్ణంపై పట్టణీకరణ, ఆక్వా, మూలపేట పోర్టు ప్రభావం

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం : తాజాగా కురిసిన వానలు జిల్లా రైతుల నెత్తిపై పాలు పోశాయి. ఖరీఫ్ ఆరంభంలో వరుణుడు ముఖం చాటేయడంతో ఖరీఫ్ సాగు విస్తీర్ణం తగ్గిపోతుందని అందరూ అంచనా వేశారు. కానీ ఇటీవల కురిసిన వానలు మళ్లీ పొలాలను పచ్చగా మార్చాయి. ఏటా సాగయ్యే సాధారణ విస్తీర్ణానికి దగ్గరగా ఈ ఏడాది కూడా సాగు జరుగుతోంది. ముఖ్యంగా పలాస డివిజన్‌ను తాజాగా కురిసిన వానలే కాపాడాయి. ఇచ్ఛాపురం నియోజకవర్గంలోని మూడు మండలాలు తప్ప దాదాపు జిల్లా వ్యాప్తంగా ఆశించిన మేర సాగు జరిగింది. నీరు కూడా అందుబాటులో ఉండటంతో ఈసారి ఖరీఫ్‌కు ఢోకా ఉండదని అధికార వర్గాలు చెబుతున్నాయి.

ముందు ఉసూరుమనిపించి..

సాధారణంగా ఖరీఫ్ సీజన్‌లో జూన్, జూలై, ఆగస్టు, సెప్టెంబర్‌లో వర్షాలు బాగా పడతాయి. కానీ ఈ ఏడాది జూన్‌లో తక్కువ వర్షపాతం నమోదైంది. దీంతో ఖరీఫ్ సన్నద్ధతపై కాస్త అయోమయం ఏర్పడింది. జూలైలో అనూహ్యంగా ఎక్కువ వర్షాలు పడటంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు. మళ్లీ ఆగస్టులో వర్షాలు తక్కువగా పడ్డాయి. దీంతో కరువు తప్పదేమో అన్న బెంగతో ఉన్న తరుణంలో సెప్టెంబర్‌లో మళ్లీ ఆశించిన మేర వర్షాలు కురిశాయి. దీంతో సాధారణ విస్తీర్ణం మేరకు సాగు చేయగలిగారు.

వంశధార, తోటపల్లి నుంచి సాగునీరు

తొలుత వర్షాలు తక్కువగా పడటంతో సాగునీటిపై రైతులు అనుమానం పెట్టుకున్నారు. ఆశించిన మేరకు ఇన్‌ఫ్లో లేకపోవడంతో సాగునీటికి ఇక్కట్లు తప్పవని భయపడ్డారు. తర్వాత అనూహ్యంగా వర్షాలు పడటం, ఎగువ ప్రాంతాల్లోనూ వానలు కురవడంతో వంశధార, తోటపల్లి ప్రాజెక్టుల ద్వారా నీరు వచ్చి చేరింది. దీంతో శివారు ప్రాంత ఆయకట్టుకు కూడా నీరు అందే అవకాశం ఏర్పడింది. రిజర్వాయర్లలో తక్కువ నీరు ఉన్న క్రమంలో ముఖ్యంగా వంశధార కాలువల నుంచి పలాస ఏరియాకు నీరు వెళ్లని పరిస్థితి ఉండేది. వదిలిన నీరు మధ్యలో ఉన్న ఎత్తిపోతల పథకాల ద్వారా లాగేయడంతో పలాస డివిజన్‌కు సాగునీరు అందలేదు. దీంతో అక్కడ రైతులు ఆందోళన చెందడమే కాకుండా నిరసనలకు కూడా దిగారు. ఈ క్రమంలో వర్షాలు జోరుగా పడటంతో సాగునీటి సమస్య తీరింది. శివారు ప్రాంతాలకు కూడా ప్రస్తుతం సాగునీరు వెళ్తున్న పరిస్థితి నెలకొంది. దీంతో పలాస డివిజన్ ఊపిరిపీల్చుకుంది.

సాగు విస్తీర్ణం

ఈ ఏడాది	
వరి సాగు విస్తీర్ణం :	1,38,831 హెక్టార్లు
ఇతర పంటలు :	11,330 హెక్టార్లు
సాగు శాతం (ఇప్పటి వరకు)	: 86 శాతం

(పట్టణీకరణ, ఆక్వా సాగు, మూలపేట పోర్టు నిర్మాణంతో తగ్గింది)

వర్షపాతం ఇలా..

ఏటా జూన్ 1వ తేదీ నుంచి సెప్టెంబర్ 25 వరకు జిల్లా మొత్తం సాధారణ వర్షపాతం	20,430.7 మిల్లీమీటర్లు
ఈ ఏడాది జిల్లాలో నమోదైన మొత్తం వర్షపాతం	19,917.2 మిల్లీమీటర్లు
ఏటా జూన్ 1వ తేదీ నుంచి సెప్టెంబర్ 25వరకు జిల్లా సరాసరి సాధారణ వర్షపాతం	681 మిల్లీమీటర్లు
ఈ ఏడాది నమోదైన జిల్లా సరాసరి సాధారణ వర్షపాతం	663.9 మిల్లీమీటర్లు
ఈ ఏడాది వర్షపాతం తక్కువగా ఉన్న మండలాలు	6 (జి.సిగడాం, ఇచ్ఛాపురం, కంచిలి, కవిటి, సోంపేట, నందిగాం)



ఖరీఫ్ సీజన్‌లో వర్షపాతం (మిల్లీమీటర్లలో)

జూన్‌లో ఏటా సాధారణ వర్షపాతం	134.9
ఈ ఏడాది	69.6
జూలైలో ఏటా సాధారణ వర్షపాతం	184.4
ఈ ఏడాది	319.8
ఆగస్టులో ఏటా సాధారణ వర్షపాతం	181.9
ఈ ఏడాది	128.6
సెప్టెంబర్‌లో సాధారణ వర్షపాతం	195.2
ఈ ఏడాది ఇప్పటివరకు..	163.1

ఇచ్ఛాపురంపై కాస్త ప్రభావం

ఇచ్ఛాపురం నియోజకవర్గంలో ఆశించిన స్థాయిలో వర్షాలు పడలేదు. దానికి తోడు బాహుదా నదిలోకి కూడా నీరు రాకపోవడంతో పరిసర ప్రాంతాల ఆయకట్టుకు నీరు అందని దుస్థితి ఏర్పడింది. దీంతో అక్కడ పూర్తిగా కరువు తప్పదేమో అనిపించింది. ఈ క్రమంలో అక్కడ కూడా వర్షాలు పడటంతో పరిస్థితి కొంతమేర సద్దుమణిగింది. జిల్లాలో దాదాపు మండలాల అన్నింటిలోనూ 85శాతానికి పైగా ఊభాలు జరగ్గా, ఇచ్ఛాపురం నియోజకవర్గంలో కంచిలిలో 26శాతం, ఇచ్ఛాపురంలో 69శాతం, సోంపేటలో 72, కవిటిలో 75 మేరకు ఊభాలు జరిగాయి. అత్యంత దారుణ పరిస్థితులు కంచిలి మండలంలో ఉన్నాయి.

ప్రత్యామ్నాయ ఏర్పాట్లు

ఈసారి సాగు తక్కువ జరిగిన మండలాలైన కంచిలి, కవిటి, సోంపేట, ఇచ్ఛాపురం తదితర మండలాల్లో ప్రత్యామ్నాయ పంటలు వేసేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. అక్టోబర్‌లో తుఫాన్‌లకు అవకాశం ఉండటంతో అంత వరకు ఆగి ఆ తర్వాత ప్రత్యామ్నాయ పంటలు వేయడానికి అధికారులు ప్రణాళికలు రూపొందించారు. నువ్వులు, మినుములు, రాగులు వేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే అక్కడి రైతులతో మంతనాలు జరిపారు. నవంబర్‌లో సాగు చేసేందుకు రాయితీపై అవసరమైన విత్తనాలు సరఫరా చేసేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు.

పట్టణీకరణ, ఆక్వా సాగు, పోర్టు నిర్మాణంతో..

గత ఏడాది కంటే వర్షాలు కాస్త తక్కువ పడినప్పటికీ సాగు విస్తీర్ణం మాత్రం ఎప్పటిలాగానే సాధారణ స్థాయిలో జరిగింది. కాకపోతే, పట్టణీకరణ, ఆక్వా సాగు, మూలపేట పోర్టు నిర్మాణంతో కాస్తంత తగ్గింది. ముఖ్యంగా లేఅవుట్‌లు వేయడం వల్ల సాగు భూములు కాస్తా నివాసయోగ్య భూములుగా మారాయి. ఎచ్చెర్ల, రణస్థలం, లావేరు, జి.సిగడాం, నరసన్నపేట, టెక్కలి, పొందూరు, శ్రీకాకుళం రూరల్ తదితర ప్రాంతాల్లో లేఅవుట్ల ప్రభావం కనిపించింది. ఆక్వా సాగు కూడా పెరగడంతో వరి సాగు విస్తీర్ణం తగ్గింది. వజ్రపుకొత్తూరు, నందిగాం, పోలాకి, గార, శ్రీకాకుళం రూరల్ తదితర ప్రాంతాల్లో ఆక్వా ప్రభావం చోటు చేసుకుంది. దానికి తోడు మూలపేట పోర్టు నిర్మాణంతో దాని పరిధిలో ఉన్న భూములు కాస్త సాగుకు దూరమయ్యాయి. ఫలితంగా గత ఏడాది కంటే సాగు విస్తీర్ణం తగ్గింది.

సాగు బాగుంది

జిల్లాలో సాగు బాగుంది. పట్టణీకరణ, ఆక్వా సాగు, మూలపేట పోర్టు తదితర వాటి కారణంగా విస్తీర్ణం కాస్త తగ్గినా మిగతాదంతా సాగులోకి వచ్చింది. సెప్టెంబర్‌లో కురిసిన వర్షాలు మేలు చేశాయి. ప్రాజెక్టుల్లో నీరు చేరడంతో పలాస డివిజన్ తదితర ప్రాంతాలకు సాగునీరు అందుతుండటం మంచి పరిణామం. తక్కువ ఊబాలు జరిగిన మండలాల్లో ప్రత్యామ్నాయ పంటలు వేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే రైతులతో సంప్రదింపులు కూడా చేశాం.

– శ్రీధర్,
వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్, శ్రీకాకుళం.



గణపయ్యా.. ఆరగించవయ్యా



పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ ఎంపీడీఓ కార్యాలయం జంక్షన్ వద్ద నిర్వహిస్తున్న విఘ్నేశ్వర పూజలో సోమవారం రాత్రి స్వామికి 501 రకాల ప్రసాదాలను నైవేద్యంగా సమర్పించారు. పరిసర ప్రాంతాల్లో ఉన్న భక్తులంతా పలు రకాల ప్రసాదాలు చేసి స్వామికి నివేదించారు. - కాశీబుగ్గ

స్పందనకు 187 వినతులు



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 187 వినతులు అందాయి. కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్, ట్రైనీ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, ప్రత్యేక ఉప కలెక్టర్ పి.మురళీకృష్ణ, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతి రావు వినతులు స్వీకరించారు. స్పందనలో రీఓపెన్ అయిన అర్జీలు, జగనన్నకు చెబుదాం, సంతృప్తి చెందని దరఖాస్తులు, ఏపీ పోర్టల్‌లలో పెండింగ్ లో ఉన్న అర్జీలపై కూడా ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ తెలిపారు. స్పందనలో వచ్చిన అర్జీలకు గడువును బట్టి 24 గంటల నుంచి ఐదు రోజుల్లోగా పరిష్కారం చూపాలన్నారు. సరైన సమాధానం ఇవ్వని అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని స్పష్టం చేశారు.

ఎస్పీ స్పందనకు 56 ఫిర్యాదులు



ఫిర్యాదుదారుతో మాట్లాడుతున్న ఎస్పీ జీఆర్ రాధిక

శ్రీకాకుళం క్రైమ్: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ఎస్పీ స్పందనకు 56 ఫిర్యాదులు వచ్చాయి. స్పందన ఫిర్యాదులపై శాశ్వత పరిష్కారం చూపాలని, ఫిర్యాదులు పునరావృతం కాకూడదని పోలీసులను ఎస్పీ జీఆర్ రాధిక ఆదేశించారు. ఎస్పీతో పాటు అదనపు ఎస్పీ టీపీ విఠలేశ్వర రావు, జె.తిప్పేస్వామి ఫిర్యాదుదారులతో నేరుగా మాట్లాడారు. ప్రతి ఒక్కరి సమస్యలను తెలుసుకొని తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

నెహ్రూ యువకేంద్రంలో జాబ్‌మేళా రేపు

శ్రీకాకుళం న్యూకాలనీ: స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ గ్యారేజ్‌కు ఆనుకుని ఉన్న నెహ్రూ యువ కేంద్రంలో బుధవారం జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి కొత్తలంక సుధ తెలిపారు. మహాత్మాగాంధీ క్యాన్సర్ హాస్పిటల్, హీరో మోటోకార్ప్స్ లిమిటెడ్, డైకిన్ కంపెనీ, నవత రోడ్ ట్రాన్స్‌పోర్ట్ సంస్థల్లో వివిధ పోస్టుల భర్తీకి జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, బీ ఫార్మసీ, డీఫార్మసీ, జీఎన్ఎం, బీఎస్సీ నర్సింగ్ విద్యార్హతలు కలిగి 18 నుంచి 29 ఏళ్ల మధ్య వయస్సు కలిగిన స్త్రీ, పురుషులు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి, అర్హత కలిగిన యువతీ యువకులు, నిరుద్యోగులు తమ బయోడేటాతోపాటు విద్యార్హత ధ్రువీకరణ పత్రాలు, ఆధార్‌కార్డు, రెండు పాస్ ఫొటోలతో నెహ్రూ యువకేంద్రం వద్దకు బుధవారం ఉదయం 10 గంటలకు హాజరుకావాలని కొత్తలంక సుధ కోరారు.

ప్రగతిలో మరింత ముందుకు

- రెండేళ్ల పాలనకు సహకరించిన వారందరికీ ధన్యవాదాలు
- ఇదే స్ఫూర్తితో మరింత ఉత్సాహంగా పనిచేస్తాం
- జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ



అరసవల్లి: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత మహిళలకు 50 శాతానికి పైగా పదవులు ఇచ్చి, దేశానికే ఆదర్శంగా నిలిచిందని, అందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లుగా జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ ప్రకటించారు. జెడ్పీ పాలనకు సోమవారంతో రెండేళ్లు పూర్తయినందున అందరికీ ధన్యవాదాలు చెబుతూ ఆమె సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు.

పారదర్శక పాలన లక్ష్యం

జిల్లాలో గడచిన రెండేళ్లలో కారుణ్య నియామకాల కింద పూర్తి పారదర్శకంగా మొత్తం 57 మందికి ఉద్యోగాలు కల్పించామని, 28 మందికి పదోన్నతులు కల్పించామని, అలాగే పారదర్శకంగా 424 మందికి పరిధిలోని ప్రాంతాలకు బదిలీలు చేయించామని ప్రకటించారు. అలాగే 15వ ఆర్థిక సంఘ నిధులు రూ.53 కోట్లతో 605 పనులు, జనరల్ ఫండ్ రూ.16 కోట్లలో రూ.9.38 కోట్లతో 241 పనులను వివిధ పద్దుల కింద చేపట్టామన్నారు.

అభివృద్ధికి అడుగులు ఇలా..

జిల్లా పరిషత్ కార్యాలయం మరమ్మతు చేయించడమే కాకుండా కార్యాలయం చుట్టూ సోలార్ విద్యుత్ లైటింగ్‌ను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. అలాగే జెడ్పీ పరిపాలన భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో ఆంధ్రా యూనివర్సిటీ ఇంజినీరింగ్ నిపుణులతో సర్వే చేయించి రూ.23 కోట్లతో ఆధునిక వసతులతో కొత్త భవనం నిర్మాణానికి ప్రతిపాదించడం జరిగిందని పేర్కొన్నారు. అలాగే ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో 12 మండలాల పరిషత్ భవనాల నిర్మాణాలకు కూడా ప్రతిపాదించామని, సరుబుజ్జిలిలో రూ.2.50 కోట్లు, నందిగాంలో రూ.1.50 కోట్లు, ఇచ్ఛాపురం- రూ.1.50 కోట్లు, రణస్థలం- రూ.2.50 కోట్లు, సారవకోట- రూ.1.70 కోట్లు, లావేరు- రూ.2 కోట్లు, కంచిలి- రూ.2.50 కోట్లు, వీరఘట్టం-రూ.2.50 కోట్లు,



సీతంపేట-రూ.1.60కోట్లు, పలాస- రూ.1.45 కోట్లు, మెళియాపుట్టి- రూ.1.80 కోట్లు, వంగరలో రూ.1.70 కోట్ల అంచనాలతో మొత్తం 12 మండల పరిషత్ భవనాల రూపురేఖలు మార్చేలా అడుగులు వేస్తున్నామని ప్రకటించారు.

రానున్న రోజుల్లో..

జిల్లాలో ప్రముఖమైన పారిశ్రామిక ప్రాంతం రణస్థలం-పైడిభీమవరం మధ్య స్పెషల్ ఎకనామిక్ జోన్ ఏర్పాటు, శాలిహుండం, దంతపురి బుద్దిస్ట్ టూరిస్ట్ సర్క్యూట్ అభివృద్ధి, మహేంద్రగిరి ట్రెక్కింగ్ టూరిజం ఏర్పాటుకు చర్యలు చేపట్టేలా అడుగులు వేస్తామని ఆమె ప్రకటనలో వివరించారు. ఇప్పటికే ఉద్దానంలో రూ.700 కోట్లతో మంచినీటి ప్రాజెక్టు, పలాస కిడ్నీ పరిశోధన కేంద్రం, మూలపేటలో పోర్టు నిర్మాణం, వజ్రపుకొత్తూరులో ఫిషింగ్ జెట్టీ నిర్మాణాలు శరవేగంగా జరుగుతున్నాయని, వీటి ప్రతిపాదనలకు జిల్లా పరిషత్ వేదిక కావడం కూడా మన జెడ్పీటీసీ, ఎంపీపీలకు స్థానికంగా గౌరవం కల్పించే అంశాలని పేర్కొన్నారు. రానున్న కాలంలో మన జెడ్పీ పాలన రాష్ట్రంలోనే ఆదర్శం కాగలదని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఆదిత్యుని సన్నిధికి పైడితల్లి అమ్మవారి ప్రచార రథం

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణస్వామి ఆలయానికి విజయనగరంలోని పైడితల్లి అమ్మవారి ప్రచార రథం సోమవారం చేరుకుంది. అమ్మవారి సిరిమానోత్సవం జరగనున్న నేపథ్యంలో అమ్మవారి రథాన్ని ప్రతి పుణ్యక్షేత్రానికి తీసుకెళ్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం ఆదిత్యుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సిరిమానోత్సవ కరపత్రాలను భక్తులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రచార నిర్వహణ ప్రతినిధులు సూర్యపాత్రో, ప్రసాద్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.



ఆదిత్యుని ఆలయ పరిసరాలకు చేరుకున్న పైడితల్లి అమ్మవారి ప్రచార రథం

'జగనన్న ఆరోగ్య సురక్ష'కు ఏర్పాట్లు పూర్తి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమ నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ తెలిపారు. ప్రత్యేక వైద్య శిబిరాల నిర్వహణకు సంబంధించి పూర్తిస్థాయిలో ప్రణాళికలు రూపొందించామని ఆయన పేర్కొన్నారు. ఆయన సోమవారం తన కార్యాలయంలో సంబంధిత అధికారులతో ఈ పథకం అమలుపై సమీక్షించారు. ఏ ఇంటిలో ఎవరెవరు అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారో గుర్తించే ప్రక్రియ చివరి దశలో ఉందని వెల్లడించారు. జిల్లా వ్యాప్తంగా జగనన్న ఆరోగ్య సురక్ష పథకం కింద 30 రోజుల పాటు ప్రత్యేకంగా వైద్య శిబిరాలు నిర్వహిస్తామన్నారు. మండలానికి ఒక గ్రామం చొప్పున ప్రతిరోజూ వైద్య శిబిరాలు జరుగుతాయని, తొలుత 594 సచివాలయాలతో పాటు 13 పట్టణ ఆరోగ్య కేంద్రాల ద్వారా కార్యక్రమ నిర్వహణ కోసం మ్యాపింగ్ చేసినట్లు చెప్పారు. శిబిరంలో 105 రకాల మందులు అందుబాటులో ఉంచనున్నట్లు వెల్లడించారు. శిబిరాలకు వచ్చే రోగులకు భోజన సదుపాయం కల్పిస్తామని, ప్రతి శిబిరంలో కనీసం ఇద్దరు స్పెషలిస్టు డాక్టర్లు, ఇద్దరు పీహెచ్‌సీ వైద్యులు ఉండేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రుల నుంచి కూడా ఒక స్పెషలిస్టు వైద్యుడు హాజరయ్యేలా చూడాలని వైద్యశాఖ అధికారులకు ఆదేశాలిచ్చారు. ఇంటింటికీ వెళ్లి వలంటీర్లతో టోకెన్లు అందజేయడం, వారి గ్రామాల్లో నిర్వహించే వైద్య శిబిరాల తేదీపై ముందుగా అందరికీ తెలిసేలా ప్రచారం చేయాలని సూచించారు. సమీక్షలో డీఎంహెచ్‌ఓ బొడ్డేపల్లి మీనాక్షి, జెడ్పీ సీఈఓ ఆర్.వెంకట్రామన్, ఐసీడీఎస్ పథక సంచాలకులు బి.శాంతిశ్రీ, ఆరోగ్య శ్రీ కోఆర్డినేటర్ ప్రకాశరావు, గ్రామ, వార్డు సచివాలయాల అధికారి వాసుదేవరావు తదితరులు హాజరయ్యారు.

క్లుప్తంగా

27న తపాలా అదాలత్

శ్రీకాకుళం అర్బన్: విశాఖపట్టణం పోస్టల్ రీజియన్ పరిధిలోని తపాలా వినియోగదారుల వ్యక్తిగత ఫిర్యాదులు, సమస్యలు పరిష్కరించేందుకు ఈనెల 27న తలాపా అదాలత్ నిర్వహించనున్నట్లు ఆ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డబ్ల్యూ నాగాదిత్యకుమార్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. బుధవారం ఉదయం 11గంటలకు పోస్ట్ మాస్టర్ జనరల్ కార్యాలయం, ఎంవీపీ కాలనీ, విశాఖపట్టణంలో 111వ తపాలా అదాలత్ నిర్వహించనున్నట్లు తెలిపారు. తపాలా సర్వీసులకు సంబంధించిన ప్రత్యేక, వ్యక్తిగత ఫిర్యాదులు మాత్రమే ఈ అదాలత్‌లో చర్చిస్తామని పేర్కొన్నారు. విశాఖపట్టణం, విజయనగరం, శ్రీకాకుళం, తూర్పుగోదావరి జిల్లాల పరిధిలోని తపాలా వినియోగదారులు తమ సమస్యలు, ఫిర్యాదులను ఈనెల 26వ తేదీలోగా 111వ తపాలా అదాలత్ అను శీర్షికన డబ్ల్యూ నాగాదిత్య కుమార్ అసిస్టెంట్ డైరెక్టర్, పోస్ట్‌మాస్టర్ జనరల్ కార్యాలయం, విశాఖపట్టణం-530017 అనే చిరునామాకు పంపించాలని కోరారు.

'పాత పింఛన్ విధానమే కావాలి'

శ్రీకాకుళం పాతబస్టాండ్: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు పాత పింఛను విధానమే అమలు చేయాలని, జీపీఎస్ నిలిపివేయాలని, సీపీఎస్ రద్దు చేయాలని కోరుతూ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య ప్యాప్టో, పీఆర్‌టీయూ, ఏపీసీపీఎస్‌ఈఏ, ఎఫ్‌టీఆర్‌టీవో, ఏపీసీపీఎస్‌యుఎస్‌ల ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. సీపీఎస్ విధానం వల్ల ఉద్యోగులకు రిటైర్‌మెంట్ తర్వాత భద్రత ఉండదని, జీపీఎస్ ఆమోదయోగ్యంగా లేదని ఆందోళన వ్యక్తం చేశారు.

జిల్లాలో ఆర్మీ మేజర్ జనరల్ పర్యటన

శ్రీకాకుళం న్యూకాలనీ: ఆర్మీ మేజర్ జనరల్ రాకేష్ మనోచ సతీసమేతంగా జిల్లాలో ఆది, సోమవారం పర్యటించారు. ఆయనతో పాటు కల్నల్ విజయన్, స్టేషన్ హెడ్ క్వార్టర్స్ విశాఖ నుంచి కల్నల్ పాండే కూడా వచ్చారు. పలాస, శ్రీకాకుళంలో ఉన్న ఆర్మీ క్యాంటీన్లను పరిశీలించారని జిల్లా మాజీ సైనికుల సమాఖ్య అధ్యక్షుడు పూర్ణ చంద్రరావు కటకం తెలియజేశారు. మాజీ ఆర్మీ జవాన్ల కుటుంబ సభ్యులను పరిశీలించిన భరోసా ఇచ్చారని తెలిపారు.

విజయవంతంగా ఎస్ఐ దేహదారుఢ్య పరీక్షలు



ఎస్ఐ అభ్యర్థి కొలతలను పరిశీలిస్తున్న డీఐజీ హరికృష్ణ

శ్రీకాకుళం క్రైమ్: స్టైఫండరీ క్యాడెట్ ట్రైనీ ఎస్ఐ అభ్యర్థులకు నిర్వహించిన దేహ దారుఢ్య పరీక్షలు విజయవంతంగా పూర్తయినట్టు విశాఖపట్నం రేంజీ డీఐజీ ఎస్.హరికృష్ణ సోమవారం పత్రికా ప్రకటనలో తెలిపారు. ఆగస్టు 25 నుంచి ఈ నెల 25వ తేదీ వరకు నిర్వహించిన ఈ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులు అక్టోబర్ 14, 15 తేదీల్లో జరిగే చివరి ప్రధాన రాత పరీక్షలకు హాజరుకావాలని డీఐజీ తెలిపారు. ఈ సందర్భంగా దేహదారుఢ్య పరీక్షల్లో పాల్గొన్న పోలీసు అధికారులు, మినిస్టీరియల్ సిబ్బందిని ఆయన అభినందించారు.

అంగన్‌వాడీల ధర్నా

శ్రీకాకుళం పాతబస్టాండ్: అంగన్‌వాడీ సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సీహెచ్ అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు, శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ కె.నాగమణి ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్-హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు కె.కల్యాణి డిమాండ్ చేశారు. తమ సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీలు సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. ముందుగా ఆర్‌అండ్‌బీ బంగ్లా నుంచి ర్యాలీ నిర్వహించారు. వారు కలెక్టర్ కార్యాలయంలోకి వెళ్లేందుకు ప్రయత్నించగా తోపులాట జరిగింది. ఈ సందర్భంగా పోలీసులు 38 మందిని అరెస్టు చేసి ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో పెట్టారు. తర్వాత వ్యక్తిగత పూచీకత్తులతో విడుదల చేశారు.

గిట్టుబాటు ధర కల్పించాలని వినతి

పలాస: పలాస నియోజకవర్గంలో కొబ్బరి రైతులకు తగిన గిట్టుబాటు ధర కల్పించాలని కొబ్బరి రైతు సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు పలాస ఆర్డీవో కార్యాలయంలో రైతు ప్రతినిధులు సోమవారం ఆర్డీఓకు వినతిపత్రం సమర్పించారు. వెయ్యి కొబ్బరి కాయలకు రూ.15వేలు చెల్లించాలని, ధరల స్థిరీకరణ నిధిని ఏర్పాటు చేయాలని, ఆధారిత పరిశ్రమలు ఏర్పాటు చేయాలని, సబ్సిడీ రుణాలు అందజేయాలని, వ్యవసాయ పంపు షెట్లు ఏర్పాటు చేయాలని తదితర డిమాండ్లతో ఆర్డీవో సీతారామ్మూర్తికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు తెప్పల అజయ్‌కుమార్, కె.మోహనరావు, జోగారావు, సాంబమూర్తి, హేమసూదన్, బాలాజీ, దిలీప్, బత్తిన అప్పలస్వామి పాల్గొన్నారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹140	₹235	₹ 255

ప్రయాణం మరింత సుఖవంతం

- సీనియర్ సిటిజన్స్ వినతులను మన్నించిన ప్రభుత్వం
- ఇకపై ఆర్టీసీ బస్సుల్లో ఎలాంటి గుర్తింపు కార్డు తీసుకెళ్లకున్నా రాయితీ
- ఫోన్‌లో డిజిటల్ ఆధార్ చూపిస్తే చాలు



శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్

శ్రీకాకుళం అర్బన్: సీనియర్ సిటిజన్లకు ఏపీఎస్ ఆర్టీసీ శుభవార్త చెప్పింది. గతంలో ఆర్టీసీలో ప్రయాణించే వారికి పలు రాయితీలు ఉండేవి. అయితే కరోనా సమయంలో ప్రయాణాలు అనుకున్న స్థాయిలో లేకపోవడంతో కొన్నింటిని రద్దు చేశారు. కోవిడ్ తర్వాత ఒక్కొక్కటిగా అన్నింటినీ పునరుద్ధరిస్తున్నారు. అందులో భాగంగా సీనియర్ సిటిజన్స్‌కు వయస్సు ధ్రువీకరించే ఏదైనా గుర్తింపు కార్డు ఉంటే ప్రయాణ సమయంలో చార్జీలో 25శాతం రాయితీ ఇచ్చే విధంగా ఆర్టీసీ ప్రకటించింది. ఇపుడు మరో అడుగు ముందుకేసిన ఆర్టీసీ సీనియర్ సిటిజన్స్‌కు ఊరటనిచ్చే నిర్ణయం తీసుకుంది. ఇకపై ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే సీనియర్ సిటిజన్స్‌కు ఎలాంటి గుర్తింపు కార్డులూ లేకుండానే టికెట్‌పై 25శాతం రాయితీ లభించే అవకాశం కల్పించనున్నారు. ఈ మేరకు ఆర్టీసీ అధికారులు ఆదేశాలు జారీ చేశారు.

రాష్ట్రంలో ప్రస్తుతం నడుస్తున్న ఏపీఎస్ ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే వృద్ధులకు ఆరు రకాల ఐడీ కార్డులు చూపిస్తే ప్రయాణ సమయంలో టికెట్‌పై 25శాతం రాయితీ ఇస్తున్నారు. ఇందులో ఆధార్ కార్డు, పాన్‌కార్డు, ఓటరు ఐడీ, పాస్‌పోర్టు, రేషన్‌కార్డులు ఉన్నాయి. ఈ ఆరు కార్డుల్లో ఏదో ఒక కార్డు తమ వెంట తీసుకువెళ్లడంతో పాటు బస్సుల్లో కండక్టర్‌కు చూపిస్తేనే రాయితీపై టికెట్ ఇచ్చేవారు. లేకపోతే రాయితీ ఇచ్చేవారు కాదు. అయితే వృద్ధులు ప్రయాణ సమయంలో ఈ కార్డుల్లో ఏదో ఒక కార్డును తమవెంట తీసుకువెళ్లడం మరిచిపోయేవారు. దీంతో వారికి రాయితీ లభించేది కాదు. ఈ నేపథ్యంలో సీనియర్ సిటిజన్స్ నుంచి ప్రభుత్వానికి పలు వినతులు అందాయి. బస్సుల్లో ప్రస్తుతం భౌతిక రూపంలో అనుమతిస్తున్న ఆరు గుర్తింపు కార్డులను డిజిటల్ రూపంలోనూ అనుమతించాలని వారు కోరారు. ఈ వినతులను పరిశీలించిన ప్రభుత్వం సీనియర్ సిటిజన్స్ అభ్యర్థనలను మన్నించింది. దీంతో ఇకపై ఈ గుర్తింపు కార్డులను ఫోన్‌లో డిజిటల్ రూపంలో ఉన్నా రాయితీకి అనుమతించేలా ఆర్టీసీకి ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. అయితే ఇందులో ఆధార్ కార్డు మాత్రమే డిజిటల్ రూపంలో ఉండడంతో దాన్ని మాత్రమే అనుమతిస్తారు. ఆర్టీసీ బస్సుల్లో ఇచ్చే టికెట్‌లతో పాటు ఆర్టీసీ ఓపీఆర్ఎస్ కౌంటర్‌లలోనూ, ఏటీబీ ఏజెంట్ల ద్వారా ఇచ్చే టికెట్లకు ఇదే నిబంధన వర్తింపజేయాలని ఆర్టీసీ ఈడీ, డీఎంలకు, సూపర్‌వైజర్‌లకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఈ మూడుచోట్ల కూడా వృద్ధులు కేవలం ఆధార్‌కార్డు ఫోన్‌లో చూపించి 25శాతం రాయితీపై టికెట్‌లు పొందేందుకు అవకాశం లభించింది. ప్రభుత్వ నిర్ణయంపై సీనియర్ సిటిజన్స్ సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వ ఆదేశాలను అమలు చేస్తాం

సీనియర్ సిటిజన్స్ విన్నపం మేరకు వయస్సు ధ్రువీకరణకు సంబంధించిన ఏదైనా ఐడీ సెల్‌లో చూపిస్తే అనుమతించాలని ఆర్టీసీ ఎండీ ఆదేశాలు జారీ చేశారు. సీనియర్ సిటిజన్ ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులూ లేకుండా చూస్తాం.

– ఎ.విజయ్‌కుమార్, డీపీటీఓ

ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం



ఆర్టీసీలో సీనియర్ సిటిజన్స్ ప్రయాణ రాయితీపై ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం. ఆర్టీసీ ప్రయాణం అంటే సురక్షితం సుఖవంతం అనే నానుడి వల్ల సీనియర్ సిటిజన్స్ అంతా ఆర్టీసీలోనే ప్రయాణిస్తుంటారు. అలాంటి వారికి ఇది ఎంతో ఉపయోగకరం. సీనియర్ సిటిజన్స్‌కు ఇచ్చే 25శాతం రాయితీని ప్రభుత్వం ముందు ముందు మరింతగా పెంచాలి.

– పైడి వేణుగోపాలం, బీజేపీ రాష్ట్ర నాయకుడు

సంతోషకరం



ఏదైనా గుర్తింపు కార్డు చూపిస్తే తప్ప ప్రయాణ సమయంలో టికెట్ రాయితీ ఇచ్చే వారు కాదు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వల్ల సెల్ ఫోన్‌లో గుర్తింపు కార్డు భద్రపరచుకుంటే చాలు. గుర్తింపు కార్డును వెంట తీసుకువెళ్లాల్సిన పరిస్థితి ఉండదు. ప్రయాణ హడావుడిలో కొన్ని సందర్భాల్లో వయస్సు ధ్రువీకరణ కార్డును మరచిపోతుంటారు. ఆర్టీసీ కండక్టర్ అడిగినపుడు గుర్తుకు వస్తుంది. కార్డు లేకపోవడంతో ఫుల్ చార్జీ చెల్లించాల్సి వచ్చేది. ఇపుడు అలాంటి పరిస్థితి ఉండదు.

– పాలకొండ అప్పారావు, విశ్రాంత ఉద్యోగి

క్రీడలతో విశ్వవ్యాప్త గుర్తింపు

- జిల్లా విద్యాశాఖాధికారి కె.వెంకటేశ్వరరావు
- జిల్లాస్థాయి స్కూల్‌గేమ్స్ ఎంపిక పోటీలు ప్రారంభం



పోటీలకు హాజరైన బాలబాలికలు



కబడ్డీ ఆడి పోటీలను ప్రారంభిస్తున్న డీఈఓ వెంకటేశ్వరరావు

శ్రీకాకుళం న్యూకాలనీ: క్రీడలతో విశ్వవ్యాప్తంగా గుర్తింపు, గౌరవం లభిస్తుందని జిల్లా విద్యాశాఖాధికారి కె.వెంకటేశ్వరరావు అన్నారు. జిల్లా విద్యాశాఖ పరిధిలోని జిల్లా స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల మైదానంలో సోమవారం జిల్లా స్కూల్‌గేమ్స్ ఎంపిక పోటీలను ఉప విద్యాశాఖాధికారి గార పగడాలమ్మతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఈఓ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పాఠశాలల్లో విద్యార్థులు వ్యాయామం, క్రీడల్లో పాల్గొనేందుకు ఉపాధ్యాయులు చొరవ చూపించాలని కోరారు. గార పగడాలమ్మ మాట్లాడుతూ జిల్లాలో పీడీలు, పీఈటీలు అత్యంత సమర్థులని, మంచి ఫలితాలను సాధిస్తున్నారని అన్నారు. వ్యాయామ ఉపాధ్యాయులు ఉత్తమ క్రీడాకారులను తయారు చేయాలన్నారు. ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి బీవీ రమణ మాట్లాడుతూ స్కూల్‌గేమ్స్ నిర్వహణకు ప్రభుత్వాలు నిధులను ప్రత్యేకంగా కేటాయించడం లేదని, దీంతో క్రీడా ఎంపికల నిర్వహణ భారంగా మారుతోందన్నారు. జిల్లా పీడీ పీఈటీ అసోసియేషన్ అధ్యక్షుడు ఎంవీ రమణ మాట్లాడుతూ ఎలాంటి ఒత్తిళ్లకు తలొగ్గకుండా జిల్లా స్కూల్‌గేమ్స్ క్రీడా జట్లు ఎంపికలను పారదర్శంగా పూర్తి చేయాలని సెలెక్షన్ కమిటీలకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ కార్యదర్శి ఎం.సాంబమూర్తి, సలహాదారు పి.సుందరరావు, పి.తవిటయ్య, సంపతిరావు సూరిబాబు, కె.మాధవరావు, పి.రాజారావు, చల్లా జగదీష్, శ్రీనివాసరావు, నారాయణరావు, తిరుపతిరావు, పీడీలు, పీఈటీలు పాల్గొన్నారు.

తొలిరోజు ఉత్సాహంగా పోరు..

జిల్లా స్కూల్‌గేమ్స్ ఎంపిక పోటీలు ఆద్యంతం ఉత్సాహంగా సాగాయి. త్వరలో వివిధ జిల్లాల్లో జరిగే రాష్ట్రస్థాయి స్కూల్‌గేమ్స్ పోటీల్లో పాల్గొనే జిల్లా జట్లను ఇక్కడ ఎంపిక చేస్తున్నారు. ఐదు రోజులపాటు జరిగే ఈ ఎంపికలు ఈనెల 29వరకు కొనసాగనున్నాయి. కాగా ఎంపికల్లో భాగంగా తొలిరోజు కబడ్డీ, ఖోఖో, ఫుట్‌బాల్, షటిల్ బ్యాడ్మింటన్, లాన్‌టెన్నిస్, ఆర్చరీ క్రీడాంశాల్లో ఎంపిక పోటీలు జరిగాయి. ఈ ఎంపికలకు జిల్లా నలుమూలల నుంచి 1200 మంది వరకు బాలబాలికలకు హాజరయ్యారు. తమ ప్రతిభను నిరూపించుకున్నారు. జగనన్న గోరుముద్ద ద్వారా క్రీడాకారులకు మధ్యాహ్నం భోజనం కల్పించారు.

పాత కోర్టు సముదాయం భవనాల కూల్చివేత



టెక్కలి గోపీనాథపురంలో పాత కోర్టు సముదాయాల వద్ద జరుగుతున్న కూల్చివేత

టెక్కలి: టెక్కలి గోపినాథపురంలో శిథిలావస్థకు చేరిన పాత కోర్టు సముదాయం భవనాల కూల్చివేత పనులు చేపట్టారు. సుమారు ఆరేళ్ల కిందట భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరి భవనం పెచ్చులూడి స్వల్ప ప్రమాదాలు జరుగుతుండడంతో, కోర్టు సముదాయాన్ని మరో చోటకు మార్పు చేశారు. ప్రస్తుతం పాత ప్రభుత్వ ఆస్పత్రి ప్రాంగణంలో కోర్టు సముదాయాలను నిర్వహిస్తున్నారు. అయితే ప్రస్తుతం పాత కోర్టు కూల్చివేత పనులు వేగవంతం చేస్తున్నారు. హైకోర్టు ఆదేశాల మేరకు జిల్లా జడ్జి పర్యవేక్షణలో భాగంగా కొత్తగా కోర్టు సముదాయాల నిర్మాణంతో పాటు క్వార్టర్స్ నిర్మాణాలకు సంబంధించిన కొత్త ప్రతిపాదనలు సిద్ధం చేశామని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు డి.వివేకానంద వెల్లడించారు.

జాతీయ స్థాయి అథ్లెటిక్ పోటీలకు సత్యవరం విద్యార్థిని



హారికను సత్కరిస్తున్న కళాశాల యాజమాన్య ప్రతినిధులు

నరసన్నపేట: మండలంలోని సత్యవరానికి చెందిన పేదింటి విద్యార్థిని బెవర హారిక జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైంది. ఈ మేరకు పద్మావతి జూనియర్ కళాశాల డైరెక్టర్ సీహెచ్ దుర్గప్రసాద్ తెలిపారు. గుంటూరు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో జరిగిన 34 వ సౌత్ జోన్ అథ్లెటిక్స్ పోటీల్లో లాంగ్‌జంప్, ట్రిపుల్ జంప్ విభాగాల్లో హారిక ద్వితీయ స్థానంలో నిలిచి వెండి పతకాన్ని సాధించింది. దీంతో విద్యార్థిని త్వరలో జరగనున్న జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. దీంతో ఆమెను సోమవారం కాలేజీ డైరెక్టర్ సీహెచ్ దుర్గాప్రసాద్‌తో పాటు పలువురు సత్కరించారు.

క్లాప్ మిత్రలతో కప్పు కాఫీ



టెక్కలిలో క్లాప్ మిత్రలతో కలిసి కాఫీ తాగుతున్న సబ్ కలెక్టర్ నూరుల్ కమర్, అధికారులు

టెక్కలి: జగనన్న స్వచ్ఛ సంకల్పంలో భాగంగా సబ్ కలెక్టర్ నూరుల్ కమర్, ఇతర అధికారులంతా టెక్కలిలో క్లాప్ మిత్రలతో కలిసి 'కాఫీ' తాగారు. స్థానిక జిల్లా ఆస్పత్రి పక్కనే గల చెత్త నుంచి సంపద తయారీ కేంద్రంలో పనిచేస్తున్న క్లాప్ మిత్రలతో సబ్ కలెక్టర్ నూరుల్ కమర్ కాసేపు మాట్లాడారు. అనంతరం వారితో కలిసి కాఫీ తాగారు. ఈ సందర్భంగా క్లాప్ మిత్రలంతా తమ సమస్యలను సబ్ కలెక్టర్‌కు విన్నవించారు. ఆయన తోపాటు డీఎల్‌పీఓ ఐవీ రమణ, ఎంపీడీఓ హెచ్.వి.రమణమూర్తి, ఈఓపీఆర్‌డీ మల్లేశ్వరరావు, పంచాయతీ సిబ్బంది శశికుమార్‌తో పాటు స్థానిక నాయకులు బి.ధనుంజయ్, ఎ.రాహుల్‌కుమార్ పాల్గొన్నారు.

'జానపద కళలను బతికించుకోవాలి'



కళాకారుల నృత్యాభినయం

పలాస: జానపద కళలను బతికించుకోవాలని ప్రముఖ జానపద కళాకారుడు, సినీ నటుడు డాక్టరు కుమార్‌నాయక్ చెప్పారు. పలాస మండలం బొడ్డపాడు గ్రామానికి చెందిన జానపద కళాకారుడు పోతపల్లి నాగు సంతాప సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. సోమవారం గ్రామంలో జెస్సీ ఈవెంట్స్ ఆర్గనైజరు, జైభీమ్ యువజన సంఘం అధ్యక్షుడు కిక్కర ఢిల్లీరావు అధ్యక్షతన జరిగిన సభలో పలువురు వక్తలు ప్రసంగిస్తూ ఉద్దానం ప్రాంతంలో అపారమైన జానపద సంపద ఉందని, దాన్ని ప్రజల జీవితాలను బాగు చేయడానికి ఉపయోగించాలని కోరారు. ఈ సందర్భంగా నాగు జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ పలువురు కళాకారులు తమ జానపద నృత్యాలతో అలరించారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రజా సంఘాల నాయకులు పుక్కళ్ల చిరంజీవులు, ఉప్పరపల్లి ఉదయకుమార్, రాపాక ధనరాజు, బొడ్డపాడు సర్పంచి తామాడ మదన్, ఎం.పి.పి. మద్దిల పాపారావు, తామాడ త్రిలోచనారవు, పుచ్చ దుర్యోధనరావు, మద్దిల రామారావు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణాల పరిశీలన



శ్రీకాకుళం నక్కవీధి రామాలయాన్ని పరిశీలిస్తున్న ఈఈ రమణ, పక్కనే చంద్రశేఖర్ తదితరులు

అరసవల్లి: తిరుమల తిరుపతి దేవస్థానాల నిధులతో జిల్లాలో చేపడుతున్న పలు ఆలయాల నిర్మాణాలను సోమవారం సంబంధిత ఇంజినీరింగ్ అధికారులు స్థానిక జిల్లా ఎండోమెంట్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సీహెచ్‌వీ రమణ మాట్లాడుతూ జిల్లాలో నిర్మాణాలు జరుగుతున్న 7 ఆలయాలను పరిశీలించామని, అయితే ఇప్పటికే వివిధ స్థాయిల్లో నిర్మాణాలు జరిగిన ఆలయాలకు మాత్రమే తొలి విడత నిధులను మంజూరు చేశామన్నారు. జిల్లాలో ఈ మేరకు నగరంలోని నక్కవీధి శ్రీరామమందిరం, దూసిపేటలో రామాలయం, ఆమదాలవలసలో శ్రీవిజయభవాని అమ్మవారి ఆలయం, అనంతగిరిపేటలో రామాలయం, సోమిదాలవలసలో శ్రీరామాలయం, కొత్తగూడలో కృష్ణభగవాన్ ఆలయం, బసవరాజుపేటలో చెవిటమ్మతల్లి ఆలయాలను సందర్శించామని తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా ఎండోమెంట్ అధికారి ఎస్.చంద్రశేఖర్, ఇన్‌స్పెక్టర్ ప్రసాద్‌బాబు, సహాయ ఇంజినీర్లు యశ్వంత్, జితేంద్ర తదితరులు ఉన్నారు.

నిఫా వైరస్‌పై అప్రమత్తత



రిమ్స్‌లో సిద్ధం చేసిన ప్రత్యేక వార్డు

- రాష్ట్రంలో వైరస్ జాడ లేకపోయినా ముందు జాగ్రత్తలు
- ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రత్యేక వార్డులు
- రిమ్స్‌లో 50 పడకలతో ఆక్సిజన్‌తో బెడ్స్ ఏర్పాటు
- వైద్యుల బృందం, మందులు సిద్ధం

శ్రీకాకుళం: కేరళను వణికిస్తున్న నిఫా వైరస్‌పై రాష్ట్ర ప్రభుత్వం ముందుచూపుతో వ్యవహరిస్తోంది. ఈ కొత్త ఉపద్రవంపై ఇప్పటికే ఆస్పత్రులను అప్రమత్తం చేసింది. కోవిడ్ విపత్తును ఎదుర్కొన్న అనుభవంతో ముందుగానే ఈ ఉపద్రవాన్ని ఎదుర్కొనేలా సన్నద్ధమవుతోంది. రాష్ట్రంలో ఎక్కడా ఈ వైరస్ జాడ కనిపించకపోయినా.. కేరళలో వ్యాధిగ్రస్తుల సంఖ్య పెరుగుతుండటం, ఇటీవల మృత్యువాత పడుతున్న వారి సంఖ్య కూడా పెరగటంతో ఆ రాష్ట్రంలో లాక్‌డౌన్ ప్రకటించారు. రాష్ట్రంలో వైరస్ బాధితులు లేకపోయినా కేరళలో వైద్యులు, ప్రపంచ ఆరోగ్య సంస్థ హెచ్చరికల నేపథ్యంలోను ముందుచూపుతో రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తోంది.

50 పడకలతో ప్రత్యేక వార్డు సిద్ధం

గబ్బిలాలు, పందుల ద్వారా ఈ వైరస్ వ్యాప్తి చెందుతుందని చెబుతుండగా.. జిల్లాలో 170 కిలోమీటర్ల జాతీయ రహదారి, వలస వెళ్లే మత్యకారులు ఉండటంతో పాటు కేరళ రాష్ట్రం పర్యాటక ప్రాంతాలతో నిండి ఉన్నందున అక్కడికి వెళ్లి వస్తున్న వారి సంఖ్య ఎక్కువగానే ఉంటోంది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు అన్ని ప్రభుత్వాస్పత్రుల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. రిమ్స్‌లో ప్రస్తుతం 50 పడకలతో ఒక ప్రత్యేక వార్డును సిద్ధం చేసి ఆరుగురు వైద్యులతో బృందాన్ని ఏర్పాటు చేశారు. కోవిడ్ సమయంలో రిమ్స్‌లో రెండు లిక్విడ్ ఆక్సిజన్ ప్లాంట్లు ఉండటంతో ఆస్పత్రిలో ఉన్న 700 పడకలకు ఒకేసారి ఆక్సిజన్ సరఫరా చేసే సామర్థ్యం ఉంది. అయితే.. ప్రస్తుతం నిఫా వార్డులో 50 పడకలతో ఆక్సిజన్ సరఫరా చేసే విధంగా ఏర్పాట్లు పూర్తి చేశారు. త్వరలోనే రక్త పరీక్షలు జరిపేందుకు అవసరమైన కిట్లు జిల్లాకు రానున్నట్టు వైద్య అధికారులు చెబుతున్నారు.

మందులు రెడీ

నిఫా వైరస్‌కు ఇంకా టీకా రాకపోవటంతో రోగి లక్షణాలను బట్టి చికిత్స చేసేందుకు అవసరమైన మందులు సిద్ధం చేశారు. వీటిలో ఎక్కువగా కోవిడ్ సందర్భంలో వినియోగించిన మందులే కావటంతో ప్రభుత్వం ఇప్పటికే ఆయా మందులను ఆస్పత్రులకు పంపించింది. రోగి పరిస్థితి విషమంగా మారిన సమయంలో వినియోగించే రెమిడెసివిర్ వంటి ఖరీదైన మందులను కూడా ఆస్పత్రుల్లో సిద్ధంగా ఉంచారు.

నిఫా వైరస్‌ను ఎదుర్కొనేందుకు సిద్ధం



నిఫా వైరస్‌ను ఎదుర్కొనేందుకు రిమ్స్‌లో ప్రత్యేక వార్డును ఏర్పాటు చేసి వైద్యులను నియమించాం. మందులు కూడా సిద్ధం చేశాం. జిల్లాలో ఇప్పటివరకు ఎలాంటి కేసులు నమోదు కాలేదు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ముందస్తు చర్యగా వార్డును ఆక్సిజన్ సరఫరాతో సిద్ధం చేశాం.

– డాక్టర్ ఎల్.ప్రసన్న కుమార్, డిప్యూటీ సూపరింటెండెంట్, రిమ్స్

పీఎఫ్ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కార్యక్రమం

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): పీఎఫ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఈ నెల 28న ఔట్‌రీచ్ ద్వారా నిధి ఆప్‌కే నికత్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ మినిస్ట్రీ ఆఫ్ లేబర్ జిల్లా నోడల్ అధికారి ఎస్‌కె అహ్మద్ భాషా తెలిపారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ కార్యక్రమాన్ని శ్రీకాకుళం నగరంలో రిమ్స్ హాస్పటల్ రోడ్డుకి ఎదురుగా ఉన్న నవీన కాంప్లెక్స్‌లో ఈ నెల 28న ఉదయం 10 గంటల నుంచి నిర్వహించనున్నామని, ఈ సేవలను ప్రతి పీఎఫ్ ఉద్యోగి ఉపయోగించుకోవాలని కోరారు.

అత్తపై అల్లుడు దాడి

శ్రీకాకుళమ్ క్రైమ్: నగరంలోని చిన్న బరాటంవీధిలో అత్తపై అల్లుడు కత్తిపీటతో దాడి చేసినట్లు ఒకటో పట్టణ ఎస్ఐ బలివాడ గణేష్ తెలిపారు. శ్రీకాకుళం రూరల్ మండలం కరజాడకు చెందిన లింగం చిన్నమ్మడు(60)కు వివాహమైన ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. కొడుకులు చూడటం లేదని గత కొంతకాలంగా కుమార్తె, అల్లుడు వద్ద ఆమె ఉంటోంది. ఈ క్రమంలో సోమవారం కుమార్తె, అల్లుడు గొడవ పడుతుండగా చిన్నమ్మ మధ్యలో దూరారు. ఆ గొడవలో అల్లుడు కత్తిపీటతో ఆమె తలపై కొట్టడంతో తీవ్ర రక్తస్రావమైంది. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పాతపట్నం రైల్వేగేటు పనులు ప్రారంభం

పాతపట్నం: పాతపట్నం రైల్వేస్టేషన్ వద్ద జాతీయ రహదారిపై ఉన్న రైల్వేగేటు పక్కనే మరో రైల్వేగేటు ఏర్పాటు కోసం పనులు చేపడుతున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. సోమవారం ఉదయం రైల్వేగేటు వద్ద ట్రాక్ పనులు చేపట్టారు. ప్రయాణికుల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా రైల్వే సిబ్బంది సహకరించారు. ఎలాంటి ట్రాఫిక్ అంతరాయం లేకుండా మూడు రోజుల పాటు రైల్వే ట్రాక్ పనులు చేపట్టామని రైల్వే సిబ్బంది తెలిపారు.